సీఏఏ హెల్ప్‌లైన్ 1032 ప్రారంభించిన హోం శాఖ

న్యూఢిల్లీ, మార్చి 21: ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కింద దరఖాస్తు చేసుకోవాలనుకునే వారికి సహాయపడటానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గురువారం ఒక హెల్ప్ లైన్‌ను ప్రారంభించింది. దరఖాస్తు చేసుకునే వారికి కావాల్సిన సమాచారాన్ని అందించడానికి, సహాయపడటానికి, వారికి వచ్చే సందేహాలను తీర్చడానికి గురువారం నుంచి 1032 నంబర్‌తో పనిచేసే హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. భారత దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా ఈ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పౌరులు ఫోన్ చేయవచ్చు. ఇప్పటికే ప్రభుత్వం సీఏఏకు సంబంధించి మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి 2014, డిసెంబర్ 31కు ముందు భారత్‌కు శరణార్థులుగా వచ్చి ఉంటున్న హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు, క్రైస్తవులకు పౌరసత్వాన్ని కల్పించేందుకు కేంద్రం సీఏఏను తీసుకొచ్చింది.

ఆస్ట్రేలియా స్టూడెంట్ వీసా నిబంధనలు కఠినం

వలసలు రికార్డ్ స్థాయిలో పెరగటమే కారణం!

సిడ్నీ, మార్చి 21: అంతర్జాతీయ విద్యార్థులు, కార్మికుల వలసలు రికార్డు స్థాయికి చేరుకోవటంతో ఆస్ట్రేలియా నియంత్రణ చర్యలకు దిగింది. 'స్టూడెంట్ వీసా' నిబంధనల్ని కఠినతరం చేయబోతున్నది. మారిన నిబంధనల్ని శనివారం నుంచి అమల్లో తీసుకొచ్చేందుకు ఆస్ట్రేలియా చర్యలు చేపట్టింది. ఆ దేశ హోం మంత్రి క్లారి ఓ నీల్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో 'రెంటల్ మార్కెట్' తీవ్ర ఒత్తిడికి గురవుతున్నదని, దీంతో స్టూడెంట్ వీసా నిబంధనల్ని కఠినతరం చేసేందుకు సిద్ధమైనట్టు పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసే ఉద్దేశంతో వస్తున్న అంతర్జాతీయ విద్యార్థులను అడ్డుకునేందుకు 'జెన్యూన్ స్టూడెంట్ టెస్ట్'ను ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. విజిటర్స్ వీసాలపై వచ్చే వారికి షరతులు విధించనున్నామని అన్నారు. ఆ దేశానికి ఏటా వస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో అత్యధిక మంది ఇండియా, చైనా, ఫిలిప్పైన్స్ దేశాలకు చెందినవారే ఉన్నారు.

నాడు 14.. నేడు 6

ఏడు దశాబ్దాల్లో భారీగా తగ్గిన జాతీయ పార్టీలు • దేశంలో మొత్తంగా 2500 రాజకీయ పార్టీలు

న్యూఢిల్లీ, మార్చి 21: ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య భారతదేశ ఎన్నికల రాజకీయాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రతియేటా ఎన్నో రాజకీయ పార్టీలు పోటీపడుతున్నాయి. అయితే, వీటిల్లో ప్రభావాన్ని చూపేవి, ప్రజల మన్ననలు పొంది నిలబడేవి కొన్ని మాత్రమే. అందునా జాతీయ పార్టీలుగా గుర్తింపు దక్కించుకునే పార్టీల సంఖ్య వేళ్ల మీద లెక్కించొచ్చు. కొన్ని పార్టీలు జాతీయ పార్టీలుగా గుర్తింపు పొందినప్పటికీ కాలక్రమంలో ప్రభావం కోల్పోయి ప్రాంతీయ పార్టీలుగా మిగిలిపోయాయి. ఇంకొన్ని పార్టీలు ప్రాంతీయ పార్టీలుగా ప్రస్థానం ప్రారంభించి జాతీయ పార్టీలుగా రూపాంతరం చెందాయి. 1951 ఎన్నికల్లో 14 జాతీయ పార్టీలు పోటీ చేయగా ఈ ఎన్నికల్లో మాత్రం కేవలం ఆరు జాతీయ పార్టీలు మాత్రమే ఎన్నికల బరిలో నిలుస్తున్నాయి.

- 1951లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 53 పార్టీలు పోటీ చేశాయి. వీటిల్లో 29 పార్టీలు.. జాతీయ పార్టీలుగా గుర్తించాలని కోరగా ఎన్నికల సంఘం మాత్రం 14 పార్టీలను జాతీయ పార్టీలుగా పరిగణించింది. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత మాత్రం కేవలం కాంగ్రెస్, ప్రజా సోషలిస్టు పార్టీ(సోషలిస్టు పార్టీ, కిసాన్ మజ్దూర్ పార్టీల విలీనంతో ఏర్పడింది), సీపీఐ, జనసంఘ్ మాత్రమే జాతీయ పార్టీ గుర్తింపును కాపాడుకున్నాయి.
- 1957 ఎన్నికల్లో కేవలం 15 పార్టీలు పోటీ చేయగా ఇందులో నాలుగు మాత్రమే జాతీయ పార్టీలు.
- 1962 ఎన్నికల్లో 27 పార్టీలు పోటీ చేయగా జాతీయ పార్టీల సంఖ్య ఆరుకు పెరిగింది. కొత్తగా సోషలిస్టు పార్టీ, స్వతంత్ర పార్టీలు జాతీయ పార్టీలుగా గుర్తింపు పొంది ఎన్నికల్లో నిలబడ్డాయి.
- 1992 ఎన్నికల్లో ఆరు పార్టీలు.. బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, జనతాదళ్, జనతా పార్టీ, లోక్‌దళ్ పార్టీలు జాతీయ పార్టీలుగా ఎన్నికల బరిలో నిలిచాయి.
- 1996 ఎన్నికల్లో 209 పార్టీలు పోటీ చేయగా ఇందులో ఎనిమిది జాతీయ పార్టీలు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్(ఐఎన్‌సీ), ఆల్ ఇండియా కాంగ్రెస్(తివారి), బీజేపీ, సీపీఐ, సీపీఎం, జనతాదళ్, జనతా పార్టీ, సమతా పార్టీలు జాతీయ పార్టీలుగా పోటీ చేశాయి.
- 1998 ఎన్నికల్లో 176 పార్టీలు పోటీ చేయగా ఇందులో ఏడు జాతీయ పార్టీలు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, జనతాదళ్, సీపీఐ, సీపీఎం, సమతా పార్టీలు జాతీయ పార్టీలుగా ఎన్నికల బరిలో నిలిచాయి.
- 1999 నాటికి బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, జనతాదళ్(సెక్యూలర్), జనతాదళ్(యునైటెడ్) జాతీయ పార్టీలుగా ఉన్నాయి.
- 2014 ఎన్నికల్లో మొత్తం 464 పార్టీలు పోటీ చేయగా ఇందులో ఆరు జాతీయ పార్టీలు. బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, బీఎస్పీ జాతీయ పార్టీలుగా ఎన్నికల్లో పోటీ చేశాయి.
- 2019 నాటికి కొత్తగా తృణమూల్ కాంగ్రెస్‌కు కూడా జాతీయ పార్టీ హోదా లభించడంతో ఆ ఎన్నికల్లో పోటీ చేసిన జాతీయ పార్టీల సంఖ్య 7కు పెరిగింది. మొత్తంగా 674 పార్టీలు పోటీ చేశాయి.
- ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ జాతీయ పార్టీలుగా గుర్తింపును కోల్పోయాయి. ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ పార్టీగా గుర్తింపు పొందింది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎం, నేషనల్స్ పీపుల్స్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీలు మాత్రమే జాతీయ పార్టీలుగా బరిలో ఉంటున్నాయి.
- మొత్తంగా ఇప్పుడు దేశంలో దాదాపు 2500 రాజకీయ పార్టీలు ఉన్నాయి.

గాంధీల వెనుకడుగు

- కాంగ్రెస్ కంచుకోటలకు బీటలు
- అమేథీ, రాయ్‌బరేలీలో పోటీకి రాహుల్, ప్రియాంక విముఖత

న్యూఢిల్లీ, మార్చి 21: అమేథీ, రాయ్‌బరేలీ.. ఈ పేర్లు వినగానే గాంధీల కుటుంబమే గుర్తుకువస్తుంది. ఉత్తరప్రదేశ్‌లోని అత్యంత కీలకమైన ఈ రెండు నియోజకవర్గాలు తొలి నుంచీ గాంధీల కుటుంబానికి కంచుకోటలుగా నిలుస్తూ వచ్చాయి. అయితే ఇప్పుడు వీటికి బీటలు వారాయి. నియోజకవర్గాలపై గాంధీల పట్టు చేజారుతున్నది. ఈ రెండు స్థానాలలో ఈ సారి రాయబరేలీ నుంచి ప్రియాంక గాంధీ, అమేథీ నుంచి రాహుల్ గాంధీ బరిలోకి దిగుతారని అందరూ భావిస్తుండగా.. వారు మాత్రం నిరాసక్తత చూపుతున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో అమేథీలో బీజేపీ నాయకురాలు స్మృతీ ఇరానీ చేతిలో రాహుల్ గాంధీ ఘోర పరాజయం పాలయ్యారు. ఈ క్రమంలో ఈసారి మళ్లీ అక్కడ పోటీచేసేందుకు ఆయన వెనుకడుగు వేస్తున్నారు. ఇక రాయబరేలీ నుంచి వరుసగా ఐదుసార్లు లోక్‌సభ ఎన్నికైన సోనియాగాంధీ.. ఈ సారి లోక్‌సభ బరి నుంచి తప్పుకున్నారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో రాజస్థాన్ నుంచి గెలుపొందారు. దీంతో రాయబరేలీ స్థానం నుంచి ఈసారి ఆమె కుమార్తె ప్రియాంక వాద్రాను బరిలోకి దించాలని కాంగ్రెస్ ఉత్తర ప్రదేశ్ కమిటీ తీర్మానం చేసింది. అయితే ప్రియాంక మాత్రం అందుకు ఆసక్తి చూపడం లేదని సమాచారం. అమేథీ నియోజకవర్గం 1967 నుంచి 'గాంధీ'లకు పెట్టనికోటగా ఉన్నది. ఇందిరాగాంధీ చిన్న కుమారుడు సంజయ్ గాంధీ 1980లో అమేథీ నుంచి గెలుపొందారు. ఆయన మరణించిన తరువాత రాజీవ్‌గాంధీ 1981లో జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించారు. ఆయన 1991లో హత్యకు గురయ్యేవరకు ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. అనంతరం సోనియాగాంధీ 1999లో గెలుపొందగా, 2004లో రాహుల్‌గాంధీ ఈ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. 2019 వరకు రాహుల్ ఈ సీటుకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన మొదటిసారిగా బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో 55వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే ఈ పరిస్థితిని గమనించే ఆయన గత ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ నుంచి కూడా పోటీ చేసి అక్కడ గెలుపొందారు.

మా ఆదేశాలనే ధిక్కరిస్తారా?

- తమిళ నాడు గవర్నర్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం
- పొన్ముడిని రాష్ట్ర మంత్రిగా నియమించడంపై 24 గంటల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశం

గవర్నర్ రవి

సీజేఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ, మార్చి 21: క్రిమినల్ కేసు విషయంలో తాము స్టే ఇచ్చినప్పటికీ తమిళనాడు మంత్రివర్గంలోకి పొన్ముడిని తిరిగి నియమించకపోవడంపై సుప్రీంకోర్టు గురువారం ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నర్ రవి తన చర్యల ద్వారా దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలనే ధిక్కరిస్తున్నారని వ్యాఖ్యానించింది. ఈ విషయాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని సీజేఐ చంద్రచూడ్ అన్నారు. ఒక నేరాభియోగంపై కోర్టు స్టే విధించినప్పుడు దానితో గవర్నర్‌కు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. 'రేపటి వరకు గవర్నర్‌కు గడువు ఇస్తున్నాం. మా తీర్పు అమలు కాకపోతే ఏం చేస్తామో ఇప్పుడు చెప్పం' అని సీజేఐ అటార్నీ జనరల్‌తో అన్నారు. తమిళనాడు ప్రభుత్వం పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పొన్ముడిని తిరిగి మంత్రిగా నియమించేలా గవర్నర్‌కు మార్గదర్శకాలు జారీ చేయాలని సీఎం స్టాలిన్ పిటిషన్‌లో కోరారు. పొన్ముడికి సంబంధించి ఆదాయానికి మించి ఆస్తుల కేసుపై మార్చి 11న సుప్రీం కోర్టు స్టే విధించింది. మూడేండ్ల జైలు శిక్ష నిర్ణయాన్ని సస్పెండ్ చేసింది. 'మనం చట్టబద్ధ పాలనలో ఉన్నామా? ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు ఇలా ఎలా చేస్తారు? మా ఆదేశం అమలు చేయాల్సిందే. గవర్నర్.. ఎన్నికైన ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసే రాజ్యాంగబద్ధ అధిపతి మాత్రమే. ఆయనకు కేవలం సలహాలిచ్చే అధికారం మాత్రమే ఉంది. అంతే' అని సీజేఐ అన్నారు.

కొత్త ఈసీల నియామకంపై స్టే ఇవ్వలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషనర్లుగా జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు నియామకంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, లోక్‌సభ ఎన్నికలు సమీపించినందున ఇప్పుడు స్టే ఇస్తే గందరగోళం, అనిశ్చిత నెలకొంటాయని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ప్రధాన ఎన్నికల కమిషన్, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం – 2023 అమలును నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఇవ్వాలని కోరుతూ, చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు జయ ఠాకూర్, ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్లను గురువారం కోర్టు విచారించింది. ఎన్నికల వేళ చట్టం అమలుపై స్టే ఇవ్వడం లేదా, కొట్టేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని కోర్టు పేర్కొన్నది. కాగా, ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలు ఈసీకి అందించినట్టు గురువారం సుప్రీంకోర్టులో ఎస్బీఐ అఫిడవిట్ దాఖలు చేసింది.

ఈసీ వెబ్‌సైట్‌లో బాండ్ల పూర్తి వివరాలు

- ఎట్టకేలకు ఈసీకి అందించిన ఎస్బీఐ
- వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 21: ఎట్టకేలకు ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలు బహిర్గతమయ్యాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గురువారం అల్ఫా-న్యూమెరిక్ నంబర్లతో కూడిన ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అందించింది. ఈ వివరాలను ఎన్నికల కమిషన్.. తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఎన్నికల బాండ్ల దాతలు, అందుకున్న వారి వివరాలతో కూడిన రెండు వేర్వేరు జాబితాలను వెబ్‌సైట్‌లో పెట్టింది. వీటిల్లోని వివరాల ఆధారంగా ఏ పార్టీకి ఎవరు ఎన్నికల బాండ్లు ఇచ్చారనేది వెల్లడి కానుంది. కాగా, ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలు ఈసీకి అందించినట్టు గురువారం సుప్రీంకోర్టులో ఎస్బీఐ అఫిడవిట్ దాఖలు చేసింది.

కేవైసీ వివరాలు బయట పెట్టలేం: ఎస్బీఐ

ఎన్నికల బాండ్ల దాతలు, అందుకున్న వారికి సంబంధించి కేవైసీ వివరాలు, పూర్తి బ్యాంక్ అకౌంట్ నెంబర్లను మాత్రం భద్రతా కారణాల దృష్ట్యా బహిర్గతం చేయలేమని సుప్రీంకోర్టుకు ఎస్బీఐ తెలిపింది. బాండ్లు కొన్న వారి పేర్లు, బాండ్ల విలువ, నంబరు, బాండ్లను ఎన్‌క్యాష్ చేసుకున్న పార్టీ పేరు, పార్టీ బ్యాంక్ అకౌంట్ చివరి నాలుగు అంకెలు వంటి వివరాలను ఈసీకి అందించామని, ఈ వివరాల ద్వారా దాతలెవరో, అందుకున్న రాజకీయ పార్టీలేవో తెలిసిపోతుందని ఎస్బీఐ పేర్కొన్నది.

వికసిత్ భారత్ మెసేజ్‌లు ఆపండి!

కేంద్రానికి ఎన్నికల సంఘం ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 21: ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసేందుకు వికసిత్ భారత్ సంపర్క్ కార్యక్రమం కింద ప్రజలకు బల్క్ వాట్సాప్ మెసేజ్‌లను పంపటం తక్షణమే నిలిపేయాలని కేంద్రాన్ని ఎన్నికల సంఘం గురువారం ఆదేశించింది. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తటంతో ఈ చర్యలు తీసుకున్నది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి రాకమునుపే ప్రధాని నరేంద్ర మోదీ లేఖతో పాటు సందేశాలు పంపినట్టు సంబంధిత మంత్రిత్వ శాఖ ఎన్నికల సంఘానికి తెలిపింది. అయితే నెట్‌వర్క్ సమస్యల వల్ల కొన్ని మెసేజ్‌లు ఆలస్యంగా డెలివరీ అయ్యే అవకాశముందని వివరణ ఇచ్చుకున్నది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన వారిలో తృణమూల్ కాంగ్రెస్ కూడా ఉన్నది. అలాగే మంగళవారం చండీగఢ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బల్క్ వాట్సాప్ మెసేజ్‌లకు సంబంధించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

కార్తి చిదంబరం లంచం తీసుకున్నారు: ఈడీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం చైనీస్ వీసాల కేసులో రూ.50 లక్షలు లంచం పుచ్చుకున్నారని ఈడీ ఆరోపించింది. పంజాబ్‌లోని సబో పవర్ లిమిటెడ్ అనే కంపెనీ విద్యుత్తు ప్రాజెక్టును ఏర్పాటు చేసిందని, సిబ్బంది చైనీస్ వీసాలను పునర్వినియోగించుకోవడం కోసం లంచం తీసుకున్నారని ఆరోపించింది.

చెన్నై సౌత్ బరిలో తమిళిసై

బీజేపీ మూడో జాబితా విడుదల

న్యూఢిల్లీ, మార్చి 21: ఇటీవల తెలంగాణ గవర్నర్ పదవికి రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగిన మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెన్నై సౌత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. గురువారం విడుదల చేసిన మూడో జాబితాలో తమిళనాడు నుంచి పోటీ చేసే 9 మంది అభ్యర్థుల పేర్లను బీజేపీ ప్రకటించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కోయంబత్తూరు నుంచి బరిలో దిగనున్నారు. కేంద్ర మంత్రి ఎల్ మురుగన్.. నీలగిరి నుంచి, సీనియర్ నేతలు పొన్ రాధాకృష్ణన్, ఏసీ షణ్ముగం వరుసగా కన్యాకుమారి, వెల్లూరి నుంచి పోటీ చేయనున్నారు. తమిళనాడులో ఈసారి ఎలాగైనా బోణీ కొట్టాలని కృతనిశ్చయంతో ఉన్న బీజేపీ.. రాష్ట్రంలోని వివిధ చిన్న పార్టీలతో పొత్తు కుదుర్చుకున్నది. పొత్తులో భాగంగా 20 సీట్లలో బీజేపీ, 10 సీట్లలో పీఎంకే, మూడింటిలో టీఎంసీ, రెండింటిలో ఏఎంఎంకే, ఐజేకే, ఎన్‌జేపీ రెండు చొప్పున, రెండు చిన్న పార్టీలు తలో సీటులో పోటీ చేస్తాయి.

మెదడులో చిప్‌తో వీడియో గేమ్

- న్యూరాలింక్ ప్రయోగాల్లో కీలక ముందడుగు

న్యూఢిల్లీ, మార్చి 21: మెదడులో చిప్ సాయంతో పక్షవాత బాధితుడు వీడియో గేమ్స్, ఆన్‌లైన్ చెస్ ఆడారు. ఎలాన్ మస్క్‌కు చెందిన న్యూరాలింక్ కార్పొరేషన్ ఇందుకు సంబంధించిన ప్రత్యక్ష వీడియోను విడుదల చేసింది. రోగుల ఆలోచనలను కంప్యూటర్లు నియంత్రించే విషయంలో న్యూరాలింక్ చేస్తున్న ప్రయోగాల్లో దీన్ని కీలక ముందడుగుగా భావిస్తున్నారు. పక్షవాతం లాంటి త్రీవ రోగాలతో బాధపడేవారితో ఈ ప్రాజెక్ట్ ప్రయోగాలు చేస్తామని మస్క్ ప్రకటించారు. ఇతర పరికరాల కన్నా న్యూరాలింక్ డివైస్‌లు ఎక్కువ ఎలక్ట్రోడులను కలిగి ఉంటాయి. దీనివల్ల భవిష్యత్తులో మరిన్ని సమర్థమైన అప్లికేషన్లు తయారుచేసే అవకాశం ఉంటుంది. కంప్యూటర్‌తో ఓ వ్యక్తిని అనుసంధానించడం సంతోషకరమని విస్కాన్సిన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌లేషనల్ న్యూరో ఇంజినీరింగ్ సహ డైరెక్టర్ కిప్ అలన్ లుడ్విగ్ తెలిపారు.

సుప్రీంకోర్టు ఆవరణలో హెల్ప్ డెస్క్, మీడియా ఎన్‌క్లోజర్లను భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ గురువారం ప్రారంభించారు. సీజేఐ మాట్లాడుతూ, వృద్ధులు, గర్భిణులు, ప్రత్యేక సహాయం అవసరమైనవారు, దివ్యాంగులు వంటివారు సుప్రీంకోర్టుకు రావడానికి తగిన సదుపాయాలను కల్పిస్తామన్నారు. సహాయం అవసరమైనవారికి ఏకైక వేదికగా ఈ హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందన్నారు.

అరుణాచల్ భారత్‌దే..

చైనా వైఖరిని తప్పబట్టిన అమెరికా

వాషింగ్టన్ : అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ మొండివాదన చేస్తున్న చైనాకు గట్టి షాక్ తగిలింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌దేనని అమెరికా తేల్చి చెప్పింది. భారత భూభాగంపై చైనా అసంబద్ధ వైఖరిని అమెరికా తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా అధ్యక్ష కార్యాలయంలోని సీనియర్ అధికారి ఒకరు ఈమేరకు తాజాగా ఒక ప్రకటన విడుదల చేశారు. చైనా వాదనను తీవ్రంగా ఖండిస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ ప్రిన్సిపల్ డిప్యూటీ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ వెల్లడించారు. వాస్తవాధీన రేఖ వెంట ఆ దేశం ఏకపక్షంగా చేస్తున్న ఆక్రమణ యత్నాలను వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ అరుణాచల్ ప్రదేశ్‌లో కొద్ది రోజుల క్రితం జరిపిన పర్యటనపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది.

'ఫ్యాక్ట్ చెక్'పై సుప్రీం స్టే

- బాంబే హైకోర్టు తుదితీర్పు వెలువడే వరకూ స్టే కొనసాగింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 21(నమస్తే తెలంగాణ): పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ యూనిట్ ఏర్పాటుకు బుధవారం కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై గురువారం సుప్రీంకోర్టు స్టే విధించింది. ఇది భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించిన అంశమని అభిప్రాయపడ్డ అత్యున్నత ధర్మాసనం.. ఈ అంశంపై బాంబే హైకోర్టు తుదితీర్పు వెలువరించేంత వరకూ స్టే ఆదేశాలు కొనసాగుతాయని వెల్లడించింది. నకిలీ వార్తలను, సమాచారాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో 'ఫ్యాక్ట్‌చెక్' యూనిట్‌ను తీసుకొస్తున్నట్టు కేంద్రంలోని బీజేపీ సర్కారు కిందటేడాది ఏప్రిల్‌లో పేర్కొంది. ఇందుకోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021కు సవరణలు చేసింది. అయితే, ఈ కొత్త నిబంధనలు ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే ఐటీ నిబంధనల చెల్లుబాటును సవాల్ చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మార్చి 11న విచారణ జరిపిన హైకోర్టు.. ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

అభ్యంతరాలు ఎందుకు?

కేంద్రం తాజా ఆదేశాల ప్రకారం.. 'ఫ్యాక్ట్ చెక్ యూనిట్' దృష్టిలో తప్పుగా ఉన్న కంటెంట్‌ను తమ వేదికల నుంచి సోషల్ మీడియా సంస్థలు తొలగించాలి, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు ఆ కంటెంట్‌కు సంబంధించిన లింకులను బ్లాక్ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ కొత్త నిబంధనలు వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేలా, ఆన్‌లైన్ ప్రసంగాలను అడ్డుకొనే విధంగా ఉన్నాయని ప్రతిపక్షాలు, నిపుణులు విమర్శిస్తున్నారు. ప్రత్యేకించి న్యూస్ పబ్లిషర్లు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఢిల్లీకి చెందిన డిజిటల్ రైట్స్ గ్రూపు ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ పేర్కొన్నది. ఫేక్ న్యూస్ అవునా కాదా అనేది నిర్ణయించడంపై ప్రభుత్వానిదే తుది నిర్ణయం అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. తాజా నిబంధనలతో పీఐబీకి అపరిమిత అధికారులు లభిస్తాయని పేర్కొంటున్నారు.

ఏంటీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం?

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి తప్పుడు సమాచారం ఆన్‌లైన్‌లో ప్రచారంలో ఉంటే వాటిని 'ఫ్యాక్ట్ చెక్ యూనిట్' విభాగం పసిగట్టి సంబంధిత వేదికలకు సమాచారం ఇస్తుంది. ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఫ్లాగ్ చేసిన వార్తలను ఆయా మీడియా సంస్థలు తప్పనిసరిగా తొలగించాల్సి ఉంటుంది. అలా చేయని సంస్థలు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

భారత్‌లో తగ్గిన సంతానోత్పత్తి రేటు

- 1950లో 6.2.. ఇప్పుడు 2 లోపే
- 2050 నాటికి 1.29కి తగ్గొచ్చు
- పేద దేశాల్లో అధిక సంతానోత్పత్తి
- లాన్సెట్ జర్నల్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 21: భారత్‌లో గత కొన్నేండ్లుగా సంతానోత్పత్తి రేటు భారీగా తగ్గిపోతున్నట్టు లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడైంది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్(జీబీడీ) అనే సంస్థకు చెందిన పరిశోధకులు చేసిన ఈ అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. మన దేశంలో 1950 సంవత్సరంలో 6.2గా ఉన్న సంతానోత్పత్తి రేటు 2021 నాటికి 2.0 దిగువకు తగ్గిపోయిందని ఈ అధ్యయనం పేర్కొన్నది. ఇది మరింత తగ్గబోతున్నదని, 2050 నాటికి 1.29కి, 2100 సంవత్సరానికికి 1.04కి తగ్గుతుందని అంచనా వేసింది.

- 1950లో భారత్‌లో ఒక మహిళ సగటున 4.8 పిల్లలకు జన్మనిస్తే.. 2021 నాటికి 2.2 పిల్లలకు జన్మనిచ్చిందని పేర్కొన్నది. ఇది మరింత తగ్గిపోనున్నదని, 2050 నాటికి ఒక మహిళ సగటున 1.8 మందికి, 2100 సంవత్సరం నాటికి 1.6 మందికి జన్మనివ్వవచ్చని ఈ అధ్యయనం అంచనా వేసింది.
- ప్రపంచంలో 1950లో 9.3 కోట్ల మంది జన్మించగా.. 2016లో అత్యధికంగా 14.2 కోట్ల మంది జన్మించారు. 2021 నాటికి జననాల సంఖ్య 12.9 కోట్లకు తగ్గిపోయింది. భారత్‌లో 1950లో 1.6కోట్ల మంది జన్మించగా, 2021లో 2.2 కోట్ల మంది జన్మించారు. 2050లో 1.3 కోట్ల మంది జన్మించవచ్చని ఈ సంస్థ అంచనా.
- 21వ శతాబ్దంలో చాలా దేశాలు తక్కువ సంతానోత్పత్తి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ అల్పాదాయ దేశాలు మాత్రం అధిక సంతానోత్పత్తి సమస్యలను ఎదుర్కొంటున్నాయని జీబీడీ పేర్కొన్నది. 2021లో మొత్తం ప్రపంచ జననాల్లో పేద దేశాల్లో 18 శాతం ఉండగా, 2100 నాటికి 35 శాతం వరకు పెరగవచ్చని అంచనా వేసింది.

26.Crime No: 243/2017 PS Nandigama, Ranga Reddy District Hon'ble Prl.J.F.C.M Shadnagar	U/S 341,506 r/w 34 IPC Wrongfully restraining any person, criminal intimidation	
27.Crime No:232/2017 PS Nandigama, Ranga Reddy District Hon'ble Prl.J.F.C.M Shadnagar	U/S 420 IPC Cheating	
28.Crime No:103/2016 PS Kothur now at PS Nandigama, Ranga Reddy District Hon'ble Prl.J.